క్లుప్తంగా

పెద్దమ్మతల్లి జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవం, జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. వి వి. ద ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన బత్తిని రమేశ్–ప్రేమల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరలో వివిధ రకాల ఆటబొమ్మల దుకాణాలు ఆకట్టుకున్నాయి.

కళాశాల కోసం స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ తుకారాం

కుంటాల:కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం ఉన్నత పాఠశాల భవనంలో కొనసాగుతుంది. శుక్రవారం ప్రిన్సిపాల్ తుకారాం కళాశాల భవనం నిర్మించేందుకు మండలకేంద్రం శివారులోని స్థలం పరిశీలించారు. స్థల పరిశీలనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ప్రిన్సిపాల్ తెలిపారు. గ్రామపెద్దలు దొనికెన వెంకటేశ్, బోగ లక్ష్మణ్, పీఆర్వో గజేందర్ తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు


ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

కుంటాల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గురువారం కుంటాలలో బస్టాండ్, ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు,ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న ఫ్లెక్సీలను తొలగింపచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లెక్సీలను తొలగించామని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎస్సీ హాస్టల్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని నివాసాలతోపాటు 8వ వార్డు పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అంతరాయం కల్గుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

లోకేశ్వరం: మరమ్మతుల నేపథ్యంలో మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆదాయం సమకూర్చుకోవాలి

కుంటాల: గ్రామపంచాయతీలు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని ఎంపీవో రహీం ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువు తయారీ విధానం పరిశీలించారు. అనంతరం రైతులకు కంపోస్ట్ ఎరువును విక్రయించి ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

మహారాష్ట్రకు భీమన్న గజాలు


కుంటాల: సారంగాపూర్ మండలం తాండ్ర (జి) గ్రామంలో ఈనెల 17న భీమన్న కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. భీమన్న గజాలు శుక్రవారం కుంటాలకు చేరుకోగా గ్రామస్తులు పూజలు చేశారు. కుంటాల నుంచి మహారాష్ట్రలోని మలక్‌జాం, అప్పారావుపేట్‌కు డప్పుచప్పుల నడుమ ఆలయ సమితి సభ్యులు తరలించారు. మాజీ సర్పంచ్ సూర్యం, పాలెపు నర్సయ్య, కొప్పుల నర్సయ్య, పాలెపు భూమేశ్, రమేశ్, మహేశ్, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పంటల సర్వే

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయాధికారులు పంటల సర్వే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంటల చేన్ల వద్దకు వెళ్లి సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. శుక్రవారం ఏఈవో జగదీశ్, గోడాపూర్, ఫకీర్‌నాయక్ తండాలో పంటల సర్వే నిర్వహించారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా మహేశ్

కుంటాల: హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాల ఇన్‌చార్జుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ కుంటాల మండలాధ్యక్షుడిగా మహేశ్‌యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రెసిడెంట్ శివచరణ్‌రెడ్డి తదితరులున్నారు.


రత్నాపూర్‌కాలనీ శివారులో మట్టి తరలించడంతో రెండు భాగాలుగా చీలిన గుట్ట


రత్నాపూర్‌కాండ్లి–భాగ్యనగర్ గ్రామాల మధ్యలో ఉన్న గుట్టలను తవ్వేస్తున్న అక్రమార్కులు

గుట్టలు గుటుక్కు..

జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న గుట్టలను గుట్టుగా తోడేస్తూ టిప్పర్ల ద్వారా మొరం తరలిస్తున్నారు కొందరు అక్రమార్కులు. శ్రీరాంపూర్ ప్రాజెక్టు పునరావాస ప్రాంతాలైన నిర్మల్‌రూరల్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లి, భాగ్యనగర్, న్యూపోచంపాడ్ గ్రామాల్లో ఉన్న గుట్టలను అనుమతుల్లేకుండా తోడేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. పశువుల మేతకు ఇబ్బంది అవుతుందని అధికారులకు ఫిర్యాదు చేశామని వారు స్పందించి మొరం దందా జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


టిప్పర్‌లో మొరం పోస్తున్న పొక్లెయిన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ అభిలాష అభినవ్


విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని కలెక్టరేట్ చౌరస్తా రహదారి డివైడర్ మధ్యలో విద్యార్థులు, అధికారులతో కలిసి శుక్రవారం మొక్కలను నాటారు. విద్యార్థులంతా పాఠశాలస్థాయి నుంచే పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా తోడ్పడాలన్నారు. మెరుగైన పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం ఆవశ్యకతను కుటుంబ సభ్యులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పట్టణాన్ని స్వచ్ఛ నిర్మల్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో రామారావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ హరిభువన్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

ముధోల్: మండలంలోని ఆష్టా ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఎంఈవో గోపిడి రమణారెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన గుమ్ముల గాయత్రి, చంసుర్ అర్చన, సిర్ముల అభిలాష్, బ్యాగరి హర్షవర్ధన్, బొంతల మనితేజ అనే విద్యార్థులు పరీక్షలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని సిబ్బంది అభినందించారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఎనిమిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఏటా రూ.12వేల నగదును స్కాలర్‌షిప్ రూపంలో అందిస్తారని పేర్కొన్నారు.

కాలువల్లో పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి స్పందన


కాలువలోని చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో సరస్వతి కాలువ, దాని ఉపకాలువల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పలుచోట్ల లైనింగ్ దెబ్బతింది. దీనిపై ఈనెల 12న 'సాక్షి'లో కాలువలు ఇలా.. నీరు వెళ్లేదెలా శీ ర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటిపారుదలశాఖ అధికారులు ఉపకాలువల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉపకాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, కొమ్మలను నీటిపారుదల శాఖ సిబ్బంది తొలగించారు. దీనిపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి మహేందర్

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి మహేందర్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పవర్ కిరణ్, అవిరాజ్, విక్రమ్, సాయి, శ్రీకాంత్, మహేశ్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరానికి స్పందన


బుచ్చయ్యకు పరీక్షలు చేస్తున్న వైద్యులు ముత్యంరెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. భైంసా డాక్టర్స్, మెడికల్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ కె.బుచ్చయ్య తెలిపారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థులు 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ దామోదర్ రెడ్డి, వైద్యులు ముష్కం రామకృష్ణ గౌడ్, నగేశ్, మనోజ్, ముత్యంరెడ్డి, పద్మావతి, స్నేహారెడ్డి, చంద్రశేఖర్, వైభవ్, సురేశ్, శ్రీకాంత్, రాజారెడ్డి, మహిపాల్, మెడికల్ సిబ్బంది గురుకృప వొకేషనల్ కళాశాల విద్యార్థులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సాయికుమార్ మృతిపై విచారణ చేపట్టాలి'

ఖానాపూర్: జగిత్యాల జిల్లా కథలాపురం మండలం పోసానిపేటలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఖానాపూర్ పట్టణానికి చెందిన జక్కని సాయికుమార్(26) మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని బాధిత కుటుంబీకులతోపాటు కుర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6న సాయికుమార్ తన ఇంటి నుంచి పోసానిపేటలో ఉన్న తన అత్తవారింటికీ సాయికుమార్ 9వ తేదీ నుంచి కనిపించకుండా పోయాడన్నారు. ఈనెల 13న పోసానిపేటలోని ఓ వ్యవసాయ బావిలో అతడి మృతదేహం లభించిందన్నారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకునేంత పిరికి వ్యక్తి కాదని అతనిని హత్య చేసి ఉంటారని ఆరోపించారు. దీనిపై అనుమానాలు ఉన్నాయని ఉన్నతాధికారులు విచారణ చేసి నిందితులను శిక్షించాలని కోరారు. సమావేశంలో జక్కుల మల్లేశ్, హన్మంతు, సాయిరాం, తొంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తండ్రి, కూతురుకు సన్మానం


వేణుగోపాలకృష్ణ, సుహాసినిని సన్మానిస్తున్న వైద్యవిద్యార్థుల బృందం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన శాస్త్రీయ నృత్య కళాకారిణి, వైద్యవిద్యార్థిని సుహాసిని, ఆమె తండ్రి ప్రభుత్వ వైద్య కళాశాల డీఆర్పీ డాక్టర్ వేణుగోపాలకృష్ణను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరు లఘు చిత్రాల్లో నటిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమ నటీనటులుగా ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. శుక్రవారం నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వారిని ఎంబీబీఎస్ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో వివేక్‌కృష్ణ, బాలాజీ, మానస, శృతి తదితరులున్నారు.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర


గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా గ్రామ సమీపంలో గుట్టపై మూడురోజులుగా కొనసాగుతున్న సమ్మక్క సారలమ్మ జాతర శుక్రవారం ముగిసింది. చివరిరోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంగారం(బెల్లం) పంచిపెట్టారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రేణుక సతీశ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి అవార్డు గర్వకారణం


అవార్డు గ్రహీతను అభినందిస్తున్న కాశీనాథ్

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియాస్పత్రిలో ఉన్న ఐసీటీసీ విభాగానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు రావడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ అన్నారు. ఈ మేరకు అవార్డు అందుకున్న ఐసీటీసీ సెంటర్ కౌన్సెలర్ విలాస్, మహిపాల్, ఎల్‌టీ సుధాకర్, తోఫిక్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. మరిన్ని ఉత్తమ సేవలందించి.. ఆస్పత్రికి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ష్యూర్ ఎన్జీవో సిబ్బంది, వైఆర్‌జీకే సిబ్బంది తదితరులున్నారు.

నత్తనడకన పనులు

- అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవనాలు
- బిల్లులందక నిలిచిన నిర్మాణాలు


రాశిమెట్లలో నిధులు అందక నిలిచిన గ్రామపంచాయితీ భవన నిర్మాణం

మామడ: మండలంలోని పలు గ్రామపంచాయతీలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మామడ మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో 13 పాతవి కాగా మరో 14 గ్రామపంచాయతీలు నూతనంగా ఏర్పడ్డాయి. మండలంలో కేవలం 10 గ్రామపంచాయతీలకు మాత్రమే పూర్తిస్థాయి వసతులు ఉన్నాయి. మిగిలిన 17 గ్రామపంచాయతీల కార్యాలయాలను అద్దె ఇళ్లల్లో, ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, విధులు నిర్వర్తించే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గ్రామ సభలు, ఇతర సమావేశాల సమయంలో సౌకర్యాలు సరిపోక అవస్థలు పడుతున్నారు.

ఉపాధిహామీ పథకం కింద 11, ఐటీడీఏ కింద నాలుగు..

గతేడాది ఉపాధిహామీ పథకం కింద 11, ఐటీడీఏ నిధులతో నాలుగు గ్రామపంచాయతీ భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. న్యూలింగంపల్లి, బూరుగుపల్లి గ్రామాలకు నిధులు మంజూరు కాలేదు. ఒక్కో గ్రామపంచాయతీ భవనానికి రూ.20 లక్షలు మంజూరవగా పనులు ప్రారంభించారు. వీటిలో కొరటికల్, కమల్‌కోట్ గ్రామాల పంచాయతీ భవనాలు పూర్తయ్యాయి. తాండ్ర, మామడ, కప్పనపల్లి, ఆదర్శ్‌నగర్, రాయదారి, ఆరేపల్లి, బండలఖానాపూర్, వాస్తపూర్, అనంతపేట్, న్యూసాంగ్వి, నల్దుర్తి, ఐటీడీఏ నిధులు గాయిద్‌పల్లి, మొండిగుట్ట, రాశిమెట్ల, జయరాం తండా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరవగా పనులు కొనసాగుతున్నాయి. న్యూలింగంపల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు.

ఏడాది కిందట నిలిచిన నిర్మాణం..

గిరిజన గ్రామాలైన గాయిద్‌పల్లి, మొండిగుట్ట, రాసిమెట్ల, జయరాంతండాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయి. రాసిమెట్ల, మొండిగుట్ట గ్రామాలకు బిల్లులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఏడాదిగా భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.

నిధులు మంజూరు చేయాలి



గ్రామపంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం వీడీసీ కమ్యూనిటీహాల్‌లో కార్యాలయం నిర్వహిస్తున్నారు. సమావేశాల సమయంలో కష్టమవుతోంది. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలి. – గంగాధర్, న్యూలింగంపల్లి

బిల్లులు అందించాలి



నిధులు మంజూరవడంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేశా. నిర్మాణానికి సంబంధించిన బిల్లులు అందకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నా. అధికారులు బిల్లులు అందించి నా సమస్యను పరిష్కరించాలి. – రూప్‌సింగ్, రాశిమెట్ల

పనులు వేగవంతం చేయిస్తాం

మండలంలోని గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు ఉపాధిహామీ పథకం, ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఇందులో కమల్‌కోట్, కొరటికల్ గ్రామాల్లో భవనాలు పూర్తవగా.. మిగిలినచోట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – సంజయ్, పీఆర్ ఏఈ, మామడ

'బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి'


ఖానాపూర్ : ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

ఖానాపూర్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, నాయకులు ఉన్నారు.

బాసర: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య స త్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్ , రవి పాండే, అడ్లూరి శ్రీనివాస్, హరినాయక్, శివ చంద్రగిరి, పడిపల్లి గంగాధర్ , పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జులు, మండల పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ముధోల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి హరినాయక్ కోరారు. శుక్రవారం లోకేశ్వరంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ మండల శాఖ సమావేశంలో మాట్లాడారు. 25 మంది ఓటర్లకో ఇన్‌చార్జిని నియమించాలని సూచించారు. ఉపాధ్యాయులను కలిసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరాలన్నారు. పడిపల్లి గంగాధర్, సాయినాథ్, సుమన్‌కుమార్, సంటెన్న, మురళీ, మెండె శ్రీధర్, పోతన్న, సరస్వతి, శ్రీనివాస్, నారాయణ, గణేశ్, సంతోష్, శ్రీధర్‌రెడ్డి, చరణ్, ప్రవీణ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అమరులకు నివాళి

బాసర: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల చిత్రపటాలకు శుక్రవారం బాసరలో ఎస్‌ఎస్‌యూవి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగం శశిధర్, సుదొల్ల గంగాప్రసాద్, గుడ్డోల్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: కుంటాలలోని సృజన విద్యా నిలయంలో పుల్వామా దాడిలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ప్రిన్సిపాళ్లు గంగన్న, సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

కుంటాల: మండలంలోని అందాకూర్‌లో మాజీ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న తల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం మాజీ మంత్రి ఐకేరెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అల్లోల మురళీధర్‌రెడ్డి, ధర్మాజీగారి రాజేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, రమేశ్, గైని సాయి, శివ ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కుంటాల:విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని మనోరమ ఆసుపత్రి వైద్యులు, సైకియాట్రిస్ట్ డాక్టర్ బంగారు సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. డాక్టర్ బంగారు గణేశ్, హెచ్‌ఎం .రాజేశ్వర్, పీఆర్వో శ్రీకాంత్ ఉన్నారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో శని, ఆదివారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ స్మారకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 70936 48830, 99518 87800 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్ పరిధిలోని దేవరలొద్ది సమీపంలో ప్రభులింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి సోమవారం వ రకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ధర్మకర్త రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

వృక్షార్చన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వృక్షార్చన పోస్టర్లను నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్ రెడ్డి ఆ విష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణకు పలు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఈనెల 17న మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు నేపథ్యంలో వృక్షార్చన చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.